# మినీ

ప్రస్తుతం నాకు వేతనిండా పని ఉదయం ఆఫీసుకి వెళ్ళే ప్రిపరేషన్ లో, సాయంకాలం ఆఫీసు నుండి వచ్చాక కలిగే అలసటతో రోజంతా వెళ్ళి పోతుంది.

ఇక రాత్రుళ్ళంటారా?

అడక్కండి.

మళ్ళీ ఎప్పుడు తెల్లారుతుందా అనే వ్యగ్రతతో ఎప్పుడు నిద్రపడ్తుందా అనే నిరీక్షణతో గడిచిపోతుంది. నిరీక్షణలో నాకు తోడు నా పుస్తకాలు.... మనస్సుని సేదతీర్చటానికి మార్గం మళ్ళించడానికి మళ్ళిన మార్గంలో మరచిపోయి పయనించడానికి పుస్తకాల కంటే మరేవి తోడుంటాయి.

మొదట్నుంచీ కలువకీ, చలువ చందమామకీ వున్న ప్రగాఢానుబంధం నాదీ పుస్తకాలదీ.

అలాగాడిలో సాగిపోతున్న జీవితంలో హఠాత్తుగా వచ్చింది ఈ ట్రయినింగ్. నేను వద్దుమొర్రో అంటున్నా వినకుండా రాజధానికి తరిమేశారు. మూడునెల్ల ప్రవాసం. తప్పదు. ఏనాడైతే ప్రభుత్వోద్యోగిగా జాయినింగ్ రిపోర్టిస్తామో ఆనాటినుంచే తల తాకట్టు పెట్టినట్టు లెక్క-శిరసువంచి ఆజ్ఞలు పాలించడమే - తప్పదు.

ట్రయినింగ్ సెంటరు విడిచి ఎక్కడికీ వెళ్ళే పనిలేదు. ఊళ్ళోలాగే యిక్కడా అవుతోంది కాలక్షేపం. మార్పల్లా స్థలం మనుషులు ......యక్షుడిలా శిక్ష అనుభవించి తిరిగి గూడు చేరేదాకా యీ వాతావరణం తప్పుతుందా?

రోజులు లెక్క-పెడ్తూ గడుపుతుండగా ఓ ఇన్లాండ్ లెటర్ వచ్చింది.

ఉరుములేని పిడుగులాగా వచ్చిన ఈ ఇన్ లాండ్ లెటర్ విప్పి చదివితే తప్ప భేతాళ ప్రశ్నలాగా నాకెవరు ఉత్తరం రాశారో తెలీదు. ఇంటికి ఉత్తరాలు రాయడం నా కర్తవ్యం. కానీ ఆ ఇల్లాలు నుండి ఏనాడూ ఓ ఉత్తరం ముక్కనదేలేదు. రాదు రాయడానికి రాకకాదు చేతులు రాకకాదు.మనసురాక అంతే!

మరెవరు రాశారీ వుత్తరం?

బంధువులతో రాకపోకలే తెగతెంపులు చేసుకున్నాను. ఇక జాబు జవాబు ఎక్కడ? ఆ కోవలోకే సహాధ్యాయులూ, మిత్రులూ చేరిపోయారు. మా యింటికి పోస్టుమాన్ వచ్చే అవకాశం అవసరం ఎన్నడూ ఎప్పుడూ రాలేదు.

మరి యిప్పుడీ సందేశం ఎక్కడిది?

ఉత్తరం తెరిచాను.

అక్షరాలు చూడగానే గుండె గొంతుకలోకి ఎగిసి వచ్చింది. అవే అక్షరాలు. అదే ఆరాధన......ఆమెకే పరిమితమయిన ఆప్యాయత, ఆమెకే స్వంతమైన అనురాగం..ఎన్ని వేల మందిని చూసినా కలగని తన్మయత్వం..ఎన్ని లక్షల మందిలో వెతికినా అగుపించని ఆ అక్షరాలు చెప్పలేని అందం.

ఆమె.......ఆమె.....నా మౌనరాగిణి రుక్మిణి.

మినీ అంటూ నేను ఆప్యాయంగా పిలుచుకునే నా హృదయాధి దేవత. మంజులంగా మనోహరంగా మనోమోహనంగా నా మనస్సుని జయించిన దేవీ మూర్తి

ఉత్తరంలోని అక్షరాల్లో ఆమె అందం పదాలతో పందెం వేసుకుని ఆమె నిర్హేతుక జాయమాన కటాక్షం వాక్య విన్యాసంలో ఆమె మృదు మధుర హృదయం.

నా రాఘవా!

నేను 18 వ తేదీ కడప వస్తున్నాను. మా పక్కింటివాళ్ళ అబ్బాయి పెళ్ళి...వరుడిది చిత్తూరు జిల్లా పాకాల దగ్గర పల్లె అమ్మాయిది మహబూబ్ నగర్ జిల్లాలోని కల్వకుర్తి. మధ్యే మార్గంగా కడపలో పెళ్లి చేస్తున్నార్ట. అమ్మాయి బాబాయి ఏదో మంచి పలుకుబడి వున్న ఉద్యోగం అంచేత కార్యభారం అంతా అతనే మోస్తున్నాట్ట. మగపెళ్ళి వారికి ఏదో మంచి వసతి చూపుతున్నార్ట నా తత్వం తెలిసిన మా పక్కింటి అంబుజమ్మ ఏదో లాడ్జిలో ఏ.సి రూము తీసిపెడ్తుంది. కడపలో రెండే సీజన్స్ ఉంటాయట మరి. సమ్మర్ సివియర్ సమ్మర్....ఆ వేడికి ఎక్కడ కమిలి కందిపోతానో అని మావారి ఆర్డర్ మేరకి డబుల్ ఏ.సీ రూమం తీయించారు. కానీ నేనొక్కదాన్నే వస్తున్నా.....

నేను 17 రాత్రికే అక్కడికి చేర్తాను పెళ్ళి వారితో పాటు చేరగానే నా పక్క రూము నీ పేర బుక్ చేయిస్తాను. చాలా రోజుల తరువాత నిన్ను కలుసుకోబోతున్నాను. మకిలి సోకని మబ్బుతునక నుంచి జారి వాతావరణ కాలుష్యం లేశమయినా సోకని నీ మాటలు కొన్ని గంటలయినా వినాలని వుంది.

మంచి గంధంలా మరులు గొలిపే మల్లెల్లా మరుమంలాటి మరువరానినీ మాటలు యింకా నాచెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.

తప్పక వస్తావని నమ్ముతున్నాను. ఏనాటికైనా ఎప్పుడో ఎక్కడో ఎలాగో కలుసుకుంటామనే చిరుదీపంలాంటి ఆశనన్నిన్నాళ్ళూ యీ అగ్నిగుండంలో హరిచందనంలా రక్షిస్తోంది.

నీ రాక కోసం నిరీక్షించే

నీ మినీ

కారుమబ్బుల్లో వెన్నెల విరిసినట్లైంది మినీ... మినీ...... అంటూ మనస్సు మంజులంగా కలవరిస్తున్నది.

ఎలా వచ్చిందీ వుత్తరం?

అడ్రసు చూశాను. నా స్వంత అడ్రస్సు. ఆఫీసు అడ్రస్సుకు రాస్తే అక్కడ్నుంచి రీడైరెక్టుఅయి వచ్చింది.

పోస్టలు డిపార్ట్‌మెంట్ పని చేయదనే వాళ్ళు వూరకే నిందలు వేసే మన స్తత్వం ఉన్నవాళ్లై వుండాలి! ఒక్కరోజు వ్యవధిలో క్విక్‌మెయిల్ సర్వీసులో యిక్కడికి వచ్చింది రిడైరెక్ట్ చేసిన మా ఆఫీసు వాళ్ళని కూడా అభినందించాను.

అప్పుడు పుట్టింది దిగులు ......అవును ......ది....గు......లు.....

ఎలా వెళ్ళాలి కడపకు?

రేపే పద్దెనిమిది!

పది పండెండు గంటలు ప్రయాణం బస్సులో రైలయితే మరికాస్త ఎక్కువ అసలు వీళ్ళు నన్ను వదుల్తారా? సర్వేలో లాగా ఒక్క రోజుకూడా పొల్లుపోకూడదు మొత్తం మూర్రోజులు యిక్కడ ట్రైనింగ్ కావాలి.

ఎలా? వీల్లేదంటే ఎలా?

నాలో తెగింపు వచ్చింది. స్వాతంత్ర్యం రక్షించుకోటానికి శరీరాన్ని తృణప్రాయంగా యజ్ఞ సమిధ చేసిన దేశంలో పుట్టాను. ఈ రోజు అయిపోతుందెలాగూ - రేపొక్కరోజు కళ్ళు మూసుకుంటే ఎల్లుండి ఉదయానికంతా యిక్కడుంటాను. వీలదవంటారా మెడికల్ సర్టిఫికేట్టు సంపాదించి ట్రైనింగ్ నుంచి రిలీజై పోతాను. అదీ కుదర్దంటారా- చెప్పాపెట్టకుండా పెట్టే బేడా సర్దుకుని వెళ్ళిపోతాను.

నా అదుర్దా కానీ ఆఫీసరు ఒకరోజు పర్మిషన్ అడగ్గానే సరేనన్నాడు. కడపకి వెళ్ళే రూట్లన్నీ చెప్పాడు. అప్పటికప్పుడు ఎయిర్‌లైన్స్‌కి ఫోన్‌చేసి వాయుదూత్ వుందని కనుక్కున్నాడు.

రాఘవరావుగారూ! బస్సులో వెళితే హూనమైపోతారు. రైల్లోకూడా కొంచెం యించుమించు అంతే! డబ్బు మనది కాదంటే సుఖాలు అరచేతిలోకి వస్తాయి. మీకెలాగూ డబ్బుదుబారా చేసే అలవాటు లేదు. నా మాటవిని వాయుదూత్‌లో వెళ్లండి! నాలుగు రూపాయలు ఎక్కువే అయినా హాయిగా వెడతారు.

హమ్మయ్య!

రుక్మిణి - ఊహు - మినీని చూడటానికి డబ్బు బేరీజు వేసుకునే దుస్థితి ఏనాడూ లేదు. దానికితోడు నా ఆర్థిక స్థితి మెరుగే.

మనస్సుతోపాటు, వాయువేగంతో ఏనువీధుల్లో ఎగిరివచ్చి కడపలో వాలాను

టౌన్‌లోకి రాగానే అడిగాను మంచి లాడ్జీలు ఏవని?

ముందక్కడికివెళ్లే....ఆపై విచారించుకోవచ్చు అని వదనున్నాను. అక్కడికే!

మరోగడప తొక్కక్కర్లేకుండా ఆ వెళ్ళిన హోటల్లోనే రూం నాపేర రిజర్వయి వుంది....

థాంక్ గాడ్ - కాదు గాడెస్ మినీ! రూంకు వెళ్ళాను ......స్వర్గంలో ప్రవేశించినట్లుంది.

అరగంట గడిచింది. బయటికి వచ్చాను.

మినీ ఉండేది అటా? యిటా? కారిడార్ అంతా పట్టుచీరల రెపరెపంతో ప్రేం గుబాళింపులతో కలకలలాడుతూ వుంది,

పక్కగది తలుపు తెరుచుంది. ఎవరో యువకుడు బయటికి వచ్చాడు. అతని వెంటే మరో అమ్మాయి....మరో అమ్మాయి......బహుశా అతడే వరుడేమో వాళ్ళంతా పెళ్లికొచ్చిన బంధువులు.

సో...... ఇక యీ గదిలోనే.......

పెళ్ళివాళ్ళంతా తయారై క్రిందకు వెళ్తున్నారు. బహుశా వివాహ కార్యకలాపాలకేమో....పెళ్ళి దేవుని కడపలోట

ఎవరో అమ్మాయి వెళ్ళి తలుపు తట్టింది.

నా గుండె క్షణం పాటు ఆగింది.

'తలనొప్పిగా వుందమ్మా!' మీరు వెళ్ళండి! నేను ముహూర్తానికి వస్తాను-"

"టేబ్లెట్స్ తెప్పించమంటారా-"

"వద్దమ్మా నా కలవాటు లేదు... కాస్సేపు పడుకుంటే అదే సర్దుకుంటుంది."

"సరే మేం వస్తాం మీరొక్కరూ-"

"నా గురించి ఆలోచించకండి. అనసూయతో చెప్పకండి హైరానా పడ్తుంది"

ఆ అమ్మాయి వెళ్ళేదాకా నన్ను నేను నిగ్రహించుకోవడం చాలా కష్టమైంది. వెన్నెల రాత్రిలో వీణాతంత్రీనాదం శృతిచేయంగా విన్పించినట్లు ఆ కంఠం వినగానే గుర్తించాను.

ఆ గదిలో వున్నది ఆమె - మినీ.,

అందరూ దిగి వెళ్ళేదాకా నన్ను నేను కంట్రోలు చేసుకుని ఆపై సున్నితంగా తలుపుతడ్తూ మినీ మినీ అని పిలిచాను.

ఒక్క వుదుటున వచ్చింది.

తలుపు తీసింది.

ఈ వయస్సులోనూ ఏ మాత్రం వడలని అందం తొణికిపోని తొలిగిపోని అందం... వెన్నెలంతా గూడుకట్టినట్టు అందమంతా ప్రోగు పడినట్టు సొగసంతా కుప్ప పోసినట్టు.

'రండి....'

లోపలికి నడిచాను.

'ఉదయం నుంచీ ఎదురు చూస్తున్నాను'

అయ్యో అన్పించింది.

"వస్తారో రారో. కబురందిందో లేదో పంపుతుందో కాదో - నా సౌభాగ్యం ఎల్లా ఉందో అనుకుంటున్నాను."

'ఉత్తరం ఎప్పుడందింది?"

"రెండుగంటలయ్యింది."

'అరె! ఎలా రాగలిగారు ?'

'ఆఘమేఘాలమీద'

ఆశ్చర్యంగా చూసింది.

అంతా వివరించాను.

ఆమె ముఖంలో ప్రసన్నత నిండుగా ప్రవహించే గంగానదిలాటి గాంభీర్యం.

"నా జీవితానికొకటే లక్ష్యం మినీ - నీ పిలుపుకోసం సదా ఎదురు చూడడం. వచ్చిన అవకాశంలో నిన్ను చూడడం."

'ఎందుకీ ఆరాధన?'

"నన్ను మనిషిగా తీర్చినందుకు, నా మనస్సుకి ప్రేమించడం నేర్పినందుకు ఏ కోరికా లేకుండా ఏ సంచలనం కలక్కుండా నీ ముందు నిలవగలిగినందులకు."

'రామనా!'

'మినీ'

"ఇది ఎన్ని జన్మల బంధం?"

"కోటి జన్మల బంధం శతకోటి జన్మల అనుబంధం సహస్రకోటి జన్మల అనురాగబంధం."

"నేనెవరు? నువ్వెవరు ?"

"త్వమేవాహం నువ్వే నేను నేనే నువ్వు... మినీ... ఈ జన్మలో ఓ గూటిలో ఓ గడపలో ఓ కప్పు క్రింద కలసి మెలసి బ్రతికే అదృష్టం ఈ నిర్భాగ్యుడికి లేక పోవచ్చు. నిత్యజీవితంలో ఏదో పనివల్ల భార్యాభర్తలు కొద్దికాలం వేరేవేరే గ్రామాలకు వెళ్ళినట్టు ఏదో శాపవశాత్తు నువ్వతనితో నేనామెతో సహయాత్ర చేస్తున్నా మనం మనమే... మన జీవితాలు మనవే మన ప్రేమలు మనవే... మన సంపాదనలు వాళ్ళు తింటున్నా మనస్సంసారం మాత్రం మనదే... శరీరాలు వాళ్ళతో మనస్సులు మాత్రం మనతో....

"రామనా!"

"ఎన్నటికైనా ఏనాటికైనా నది కడలిని చేరుతుంది. అది దాని గమ్యం. అలాగే మనం కలుసుకుంటాం. అది మన జీవిత గమ్యం."

"రాఘవా! నేనెంత అదృష్టవంతురాలిని.... సంవత్సరకాలం వేచి ఆ చినుకు మేసే చకోరంలాగా ఎప్పుడో ఎక్కడో ఎన్నడో ఎలాగో దొరికే ఈ మధుర క్షణాల కోసం... వేచి వుంటాను. ఈ జీవితమంతా వేచివేచి మరో జన్మకయినా."

"మనం ఒకటిగా అవుదాం మినీ - నాకు నమ్మకం వుంది. పునర్జన్మమీద, మన పుట్టుక మీద మన కలయిక మీద. ఈ జన్మంతా చేసిన నిరీక్షణాతపం వచ్చే జన్మలో పండుతుంది."

"రాఘవా బహుశా ఇదే ఈ జన్మకు మన ఆఖరి కలయికేమో!" తన్మయత్వంతో కన్నీరు ఒలుకుతోంది.

నేనూ అదే అనుకుంటున్నాను మినీ. వచ్చే సంవత్సరం రిటైరయిపోతున్నాను కదా - ఇంక ఇంట్లో కూచుని కృష్ణారామా అనుకోవటమే"

ఆ తరువాత ఇంక ఇరువురికీ మాటలు రాలేదు. ఆఖరుసారిగా విడిపోయే భయంకరమయిన అనుభూతి కోసం ఎదురు చూడసాగారు.

● జ్యోతి మాసపత్రిక ●